www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 13 నవంబర్ 2025

జ్యుడీషియల్ విచారణ చేపట్టాలి : సిపిఎం

ప్రజాశక్తి - కడప అర్బన్ : ఢిల్లీ ఘటన బాధిత కుటుంబాలకు సిపిఎం ప్రగాఢ సంతాపం తెలియజేస్తుందని జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాసులురెడ్డి, చాంద్‌బాషా ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. దేశ రాజధాని నట్టనడిబొడ్డున సోమవారం రాత్రి భయంకరమైన బాంబు దాడిని సిపిఎం తీవ్రంగా ఖండించిందని తెలిపారు. ఢిల్లీకి చుట్టుపక్కల ప్రాంతాల్లో పెద్ద మొత్తంలో పేలుడు పదార్థాలు, తుపా కులు స్వాధీనం చేసుకున్నట్లు వార్తలు వస్తుండడం పట్ల తీవ్రంగా కలత చెందుతున్నామని తెలిపారు. ఇప్పుడు ఈ దాడికి, ఆ పేలుడు పదార్థాల స్వాధీనానికి సంబంధం ఉందనే అనుమానాలు కూడా వ్యక్తమ వుతున్నాయని పేర్కొన్నారు. దీన్నిబట్టి చూస్తుంటే ఇదంతా ఒక పథకం ప్రకారం అమలు చేసిన ప్రణాళికలా ఉన్నట్లు తెలుస్తోందని తెలిపారు. ఈ నెట్‌వర్క్ వెనుక ఎవరున్నారో వారందరిపై కఠిన చర్యలు తీసుకో వాలని, బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదని పేర్కొన్నారు. నిఘా, భద్రతా వైఫల్యాలకు బాధ్యులెవరో నిర్ధారి చాలని పేర్కొన్నారు.

మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు నాయుడు, హాజరైన మహిళలు

త్వరలో శ్రీనివాస రిజర్వాయర్ పనులు

మహిళలకు తాళం అందజేస్తున్న సిఎం

- రాయచోటి, పీలేరు, తంబళ్లపల్లికి కుళాయి నీళ్లు
- ప్రతి అసెంబ్లీలో ఎంఎస్ఎంఇ పార్క్
- కేడర్ మీటింగ్‌లో వన్‌మ్యాన్ షోపై అసంతృప్తి
- చిన్నమండెంలో సిఎం చంద్రబాబునాయుడు వెల్లడి

గృహ ప్రవేశ కార్యక్రమంలో సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి/చిన్నమండెం

వచ్చే ఏడాదిలో శ్రీనివాసపురం రిజర్వాయర్ నిర్మాణ పనుల్ని పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. బుధవారం అన్నమయ్య జిల్లా చిన్నమండెం మండలం దేవగుడిపల్లిలో నిర్వహించిన మనఇళ్లు..మన గౌరవం, మూడు లక్షల గృహ ప్రవేశ, కేడర్ మీటింగ్ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లా డుతూ 2029 నాటికి రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికీ జాగాతో సహా సొంతింటి కలను సాకారం చేస్తామన్నారు. ఇల్లు లేని పేదలు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. జిల్లాలో 10 వేల ఇళ్లు పూర్తి చేశామన్నారు. దేవగుడిపల్లిలోని 40 ఇళ్లలో 18 ఇళ్లు పూర్తి చేశామని తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టిలకు ఉచితంగా సోలార్ ప్యానళ్లను అందజేస్తామన్నారు. 1991లో విద్యుత్ సంస్కరణలు తెస్తే ఓడించిన పరిస్థితి నెలకొందని తెలిపారు. ప్రస్తుతం సోలార్, విండ్ వంటి గ్రీన్ ఎనర్జీ ద్వారా లభించే మిగులు విద్యుత్ లభించే రోజులొచ్చాయని గుర్తుచేశారు. జన్‌ధన్ స్కీమ్ కింద రాయచోటి, పీలేరు, తంబళ్లపల్లి నియోజకవర్గాలకు చెందిన 840 పంచాయతీలకు తాగునీటిని అందిసా మన్నారు. రాయచోటి నియోజకవర్గ పరిధిలోని చెరువులను నింపడానికి రూ.22 కోట్లు చెల్లింపులకు ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. పెద్దల హయాం నాటి చెరువులను నింపితే భూమే జలాశయం అవుతుందని చెప్పారు. రాష్ట్రంలోని 200 ప్రాంతా ల్లోని రెయిన్ గేజ్‌లు, 50 వేల మంది గ్రామీణ అధికారుల సహకారంతో తుపాన్ నష్టాల్ని గణనీ యంగా తగ్గించగలిగామన్నారు. సంజీవని కార్యక్రమ నిర్వహణలో భాగంగా ప్రజలకు 2.5 లక్షల మేరకు ఇన్సూరెన్స్ వర్తిస్తుందని తెలిపారు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. ప్రతి అసెంబ్లీలో ఒక ఎంఎస్ఎంఇ పార్కును ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఇన్ నేషన్...ఒన్ ఎంట్ర ప్రెన్యూర్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టా మన్నారు. 2047 నాటికి రాష్ట్రాన్ని స్వర్ణాం ధ్రగా మార్చాల న్నారు. మా పార్టీ వాళ్లు తప్పు చేసినా వదులు కునేందుకు సిద్ధంగా ఉన్నామని, అన్యాయాన్ని సహించ బోమని హెచ్చ రించారు. హౌసింగ్ మంత్రి కె.పార్థసారధి మాట్లాడుతూ మాది మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమని తెలిపారు. కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటుపై జిల్లా ప్రజానీకం వైసిపిని నిలదీయాలన్నారు. రవాణా శాఖ మంత్రి మండిపల్లి మాట్లాడుతూ జన్‌ధన్ స్కీమ్ కింద రాష్ట్రంలోనే అన్నమయ్య జిల్లాకు టెండర్లు పిలవడం సంతోష కరమని కొనియాడారు. మంత్రులు, చివరిలో రాజంపేట ఇన్‌ఛార్జి జగన్ మోహన్‌రాజుతో కలిసి పార్టీ కేడర్ మీటింగ్‌కు హాజరయ్యారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే కార్యకర్తలకు అండగా నిలుస్తామని భరోసా కలిగించే ప్రయత్నం చేశారు. కార్యకర్త లను ఎవరినీ మాట్లాడనీ యకుండా ముఖ్యమంత్రి చంద్ర బాబు వన్‌మ్యాన్ షో నిర్వహించడం దేనికోసమనే వాదన కార్యకర్తల నుంచి వినిపించింది. కార్యకర్తలతో సమావేశం నిర్వహించడమంటే కార్యకర్తల బాధలను, సమస్యలను తెలుసుకోవాలి. పరిష్కా రానికి కృషి చేయాలి. ఇలా చేయకుండా మేంచెప్పిందే వినాలనే ధోరణితో ఏకపక్షంగా సాగడంవల్ల ఎలాంటి ఉపయోగమూ ఉండదనే గుసగుసలు వినిపించడం గమనార్హం. అనంతరం గృహప్రవేశ లబ్ధిదారులకు తాళాలు, ఇళ్ల స్థలాలను, ఎనర్జీ పరికరాలను, ధ్రువీ కరణ పత్రాలను అందజేశారు. అనంతరం పఠాన్ మహబూబ్‌చాన్, సహా మరొక మహిళ కుటుం బాలను బెంగళూరులోని నవజ్యోత్‌గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ చంద్రకాత్‌కు దత్తత అప్పగించారు. కార్యక్ర మంలో రైల్వేకోడూరు ఎమ్మెల్యే ఎ.శ్రీధర్, హౌసింగ్ రాష్ట్ర చైర్మన్ తాతం బాబు, కలెక్టర్ నిశాంత్‌కుమార్, ఎస్‌పి ధీరజ్ కునుబిల్లి పాల్గొన్నారు.

ముస్లిమ్ చిన్నారులతో సిఎం చంద్రబాబునాయుడు

మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణ
రద్దయ్యే వరకూ ఉద్యమం : వైసిపి

కడపలో ఆర్‌డిఒకు వినతి పత్రం అందజేస్తున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి - కడప

స్వాతంత్ర్య భారతదేశంలో కనీవినీ ఎరుగని విధంగా 17 మెడికల్ కళాశాలలు సాధించి జాతికి అంకితం చేసిన నాటి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి ఆశయానికి తూట్లు పొడుస్తూ వాటిని తమ బినామీలకు కట్టబెట్టే ప్రయత్నాన్ని ఖండిస్తూ మాజీ డిప్యూటీ సిఎం అంజాద్‌బాషా నేతృత్వంలో బుధవారం విద్యార్థులు , యువత, వైసిపి నాయకులు, మహిళలు రోడ్డెక్కారు. వైసిపి కార్యాలయం నుంచి ఆర్‌డిఒ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహిం చారు. ప్రయివేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకో వాలని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వైసిపి శ్రేణులు నాయకులు ర్యాలీలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినదించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ప్రభుత్వ రంగ సంస్థలను తన కోటరీకి ధారాదత్తం చేసిన చంద్రబాబు, ప్రస్తుతం ఆంధ్ర యువతకు ఆశాదీపమైన మెడికల్ కళాశాలలను తన స్వప్రయోజనాలకోసం తన మిత్రు లకు, బినామీలకు ధారాదత్తం చేయాలని చూస్తున్నారని నిప్పులు చెరిగారు. మెడికల్ కళాశాలల పిపిపి నిర్ణయానికి స్వస్తి పలకా లని, లేకపోతే వైసిపి నేతృత్వంలో తమ ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్రస్థాయి నాయ కులు, మండల జోన్ అధ్యక్షులు, విద్యార్థులు, యువకులు, మహిళలు, జిల్లా, నగర అనుబంధ విభాగాల అధ్యక్షులు, వైసిపి నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. **చాపాడు (మైదుకూరు) :** బుధవారం వైసిపి రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి నేతృత్వంలో మెడికల్ కళాశాలల ప్రయివే టీకరణను వ్యతిరేకిస్తూ విద్యార్థులు , యువత, నాయ కులు, మహిళలు రోడ్డెక్కారు. అనంతరం ఎంపిడిఒ శ్రీధర్ నాయుడుకు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో మాజీ సలహాదారు తిరుపాల్ రెడ్డి, ఎంపిపి థామస్, టి. లక్షుమయ్య, జయ చంద్రా రెడ్డి, రఘురామిరెడ్డి, శంకర్‌రెడ్డి, కిరణ్మయి, నాగేంద్ర ప్రసాద్, నరసింహారెడ్డి, మండల కన్వీనర్‌లు, జడ్‌పిటిసిలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **ఖాజీపేట :** కూటమి ప్రభుత్వం సామాన్య పేద ప్రజల విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసేందుకు మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణను తీసుకొచ్చిందని వెంటనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని వైసిపి బిసి సెల్ కార్యదర్శి బత్తల సుబ్బరాయుడు యాదవ్ అన్నారు. బుధవారం ఆయన ఖాజీపేటలో మీడియాతో మాట్లాడారు. కార్యక్రమంలో గంగిరెడ్డి సుదర్శన్ రెడ్డి, ఇరగంరెడ్డి బాల్ రెడ్డి, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. **పులివెందుల రూరల్ :** కూటమి ప్రభుత్వం ప్రతి మంగళవారం రూ. 5 వేల కోట్లు అప్పుగా తీసుకుం టుందని. ఒక వారం అప్పుతో రాష్ట్రంలోని పది వైద్య కళాశాలలను పూర్తి చేయ వచ్చని కడప ఎంపీ వై.ఎస్.అవినాష్‌రెడ్డి అన్నారు. బుధవారం పులివెం దులలో ప్రభుత్వం మెడికల్ ప్రయివేటీకరణను నిరసిస్తూ పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్‌డిఒకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సతీష్ కుమార్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ వై.ఎస్. మదన్ మోహన్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు. **జమ్మలమడుగు :** కూటమి ప్రభుత్వం పేద, మధ్యతరగతి ప్రజలకు వైద్యం దూరం చేసేం దుకు కుట్ర పడుతుందని ఎమ్మెల్సీ పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక వైసిపి కార్యాలయం నుండి ఎమ్మెల్సీ ఆధ్వర్యంలో మెడికల్ కళాశాలకు వ్యతిరేకంగా భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్‌డిఒ ఆదిమూలపు సాయిశ్రీకి వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా మున్సిపల్ విభాగం అధ్యక్షులు వల్లంబాయి హృషికేశవరెడ్డి, గిరిధర్‌రెడ్డి, బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి గజ్జల లక్షుమయ్య, టూరి జం శాఖ మాజీ డైరెక్టర్ లోగిడి జయన్న, చిన్నకొమెర్ల సర్పంచ్ జగదీశ్వర్ రెడ్డి, మోహన్ రెడ్డి, పి బొమ్మేపల్లి సర్పంచ్ రామనా థ్‌రెడ్డి, నాయకులు ప్రతాపరెడ్డి, అమర్‌నాథరెడ్డి, పట్టణ అధ్యక్షులు పోరెడ్డి మహేశ్వర్‌రెడ్డి, గూడెం చెరువు నాగేశ్వర్‌రెడ్డి, బిసి సెల్ కార్యదర్శి గురు మూర్తి యాదవ్, వైసిపి కౌన్సిలర్లు, సోషల్ మీడియా, అధికార ప్రతినిధులు, జడ్‌పిటిసి, ఎంపిటిసి, సర్పం చులు పాల్గొన్నారు. **ప్రొద్దుటూరు :** నియంతృత్వ పాలకుడైన హిట్లర్, ముసోలిని కోవకు చెందిన వ్యక్తి చంద్రబాబు నాయుడు అని వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు ప్రసాదరెడ్డి అన్నారు. వైద్య విద్యను ప్రైవేటుపరం చేసేందుకు వ్యతిరేకంగా బుధవారం ర్యాలీ నిర్వహించారు. స్థానిక మైదుకూరు రోడ్డులోని వై.ఎస్. విగ్రహం నుండి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ ఇన్‌ఛార్జి తహశీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **చింతకొమ్మదిన్నె (కమలాపురం) :** మెడికల్ కళాశాలలను ప్రయివేటీకరణ చేయడాన్ని వ్యతిరేకిస్తూ బుధవారం కమలాపురంలో నియోజ కవర్గ సమన్వయకర్త నరేన్‌రెడ్డి, యూత్ అధ్యక్షులు ఈశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కమలాపురం గ్రామ చావడి నుంచి తహశీల్దార్ కార్యాలయంకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పరిశ్రమల శాఖ మాజీ సలహాదారుడు రాజోలు వీరారెడ్డి, రాష్ట్ర వైసిపి ఎస్‌ఇసి సభ్యులు సాయినాధశర్మ ఆరు మండలాల కన్వీనర్లు, అన్ని మండలాల యూత్ కన్వీనర్లు చిట్టి బోయిన సుబ్బరాయుడు అలియాస్ జబ్బార్, సదానందరెడ్డి పాల్గొన్నారు.

కార్మికుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి
- కార్పొరేషన్ ఎదుట మున్సిపల్ యూనియన్ నాయకుల ధర్నా

ధర్నాను ఉద్దేశించి మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

రిటైర్డ్, చనిపోయిన కార్మికుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు అనుబంధం) నగర అధ్యక్షులు సుంకర రవి, జిల్లా ఉపాధ్యక్షులు కంచుపాటి తిరుపాల్ డిమాండ్ చేశారు. బుధవారం కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ కోవిడ్ అడిషనల్ కార్మికులకు ఇప్పటికే మూడు నెలలు అవుతున్నా అధికారులు వేతనాలు ఇవ్వకుండా తీవ్రంగా ఇబ్బంది పెడుతు న్నారని విమర్శించారు. కార్పొరేషన్ కార్మికులు శ్రమ దార పోసి నగరపాల సంస్థ సుందరీకరణలో భాగస్వాములు అవుతున్నారని తెలిపారు. కార్పొరేషన్‌కు ఊడిగం చేస్తున్న కార్మికులకు, చనిపో యిన వారి కుటుంబంలో ఇంతవరకు ఉద్యోగం లేకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఆప్కాస్ కార్మికులను రిటైర్డ్ చేస్తూ వారికి రిటైర్‌మెంట్ బెనిఫిక్, కనీసం వారికుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వ కుండా వట్టి చేతులతో ఇంటికి పంపించడం దారుణ మని పేర్కొన్నారు. తక్షణమే చనిపోయిన వారి కుటుం బంలో, రిటైర్డ్ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వర్కర్స్ నుంచి డ్రైవర్లుగా ఉద్యో గోన్నతి పొందిన వారిని డ్రైవర్ లిస్టులో చేర్చాలని కోరా రు. వాటర్ ట్యాంక్ డ్రైవర్స్ 9 మందికి మూడేళ్లుగా తీవ్రమైన వేతనాలలో అన్యాయం జరుగుతుందని, వారికి జీవో నంబర్ 36 ప్రకారం వేతనాలిచ్చి న్యాయం చేయాలని పేర్కొన్నారు. ఉద్యోగోన్నతి విషయంలో కొందరికి ఇచ్చి, బయట పనిచేస్తున్నటువంటి పర్మిట్ కార్మికులకు ఇవ్వ కుండా తీవ్రమైన అన్యాయం చేస్తున్నారని తెలిపారు. తక్షణమే వారికి న్యాయం చేయాలని చెప్పారు. తమ డిమాండ్లను తక్షేమ పరిష్కరించాలని, లేకపోతే ఈనెల 20 తరువాత పెద్ద ఎత్తున ఉద్యమానికి వెళ్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నగర సహాయ కార్యదర్శి ఇత్తడి ప్రకాష్, డ్రైవర్స్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్ బాబు, సుంకర కిరణ్, నగర కమిటీ సభ్యులు నాగరాజు నాయకులు, వెంకటేష్, మహేష్, పెంచలయ్య, రాజు, పిరయ్య, శివ నాయక్, సుబ్బయ్య, ఓబులేష్, రాముడు, సాయమ్మ, బేబీ పాల్గొన్నారు.

శ్రీచరణికి సన్మానం

శ్రీచరణిని అభినందిస్తున్న వైద్యనాథ్

ప్రజాశక్తి - కడప అర్బన్

భారత మహిళల ప్రపంచ కప్ విజేత, స్థానిక క్రీడాకారిణి నల్లపురెడ్డి శ్రీ చరణిని బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర జోనల్ మేనేజర్ ఎ. వైద్యనాథ్ సన్మానించారు. బుధవారం జిల్లాలోని ఆమె నివాసంలో కలుసుకుని, జాతీయ జట్టుకు అందించిన చారిత్రక కృషికి ప్రశంసలు, అభినందనలు తెలిపారు. చారిత్రాత్మక భారత విజయానికి స్పిన్నర్ చేసిన కృషిని ప్రత్యేకంగా ప్రశంసించారు. బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రోహిత్ రిషి వీడియో కాల్ ద్వారా శ్రీ చరణిని అభినందించారు. మహిళల 50 ఓవర్ల ప్రపంచ కప్‌ను భారతదేశం తొలిసారిగా గెలవడంలో కీలక పాత్ర పోషించిన 21 ఏళ్ల ఈ లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్‌కు వైద్యనాథ్ జ్ఞాపికను బహూకరించారు.శ్రీ చరణి సాధించిన విజయానికి తాము ఎంతో గర్విస్తున్నామని చెప్పారు.

జాతీయ ట్రెక్కింగ్ శిబిరానికి మహేష్ ఎంపిక

మహేష్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపల్

ప్రజాశక్తి - కడప

కడప ప్రభుత్వ పురుషుల (స్వయంప్రతిపత్తి) కళాశాల విద్యార్థి కె.మహేష్ జాతీయ ట్రెక్కింగ్ శిబిరానికి ఎంపిక య్యారు.యోగి వేమన విశ్వ విద్యాలయం ఎన్ఎస్ఎస్ సెల్ ఆధ్వర్యంలో హిమాచల్ ప్రదేశ్‌లోని మనాలి వద్ద జరగనున్న జాతీయ అడ్వెంచర్ ట్రైనింగ్ క్యాంప్ లో పాల్గొనడానికి కడప ప్రభుత్వ పురుషుల స్వయంప్రతిపత్తి కళాశాల మూడవ బిబిఎ విద్యార్థి కె.మహేష్ ఎంపికయ్యాడు. ఈ శిబిరం ఈనెల 22 నుండి డిసెంబర్ 1వరకు మనాలిలో నిర్వహిస్తారన్నారు. ఈ క్యాంప్‌లో దేశవ్యాప్తంగా ఎంపికైన ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొని ట్రెక్కింగ్, మౌంటీనీరింగ్, అడ్వెంచర్ శిక్షణలో పాల్గొంటారని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ రవీంద్రనాథ్, వైస్ ప్రిన్సిపల్ డా. రమేష్, ఎన్ఎస్-ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ అంకాల నాగరాజు, రమేష్ యాదవ్, శివరాం కృష్ణ జాతీయ ట్రెక్కింగ్ శిబిరానికి ఎంపికైన కె.మహేష్‌ను అభినందించారు.

డ్రాగా ముగిసిన చిత్తూరు, అనంతపురం మ్యాచ్

ప్రజాశక్తి - కడప

ఎసిఎ సౌత్ జోన్ అండర్- 14 మల్టీ డే మెన్ క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో చిత్తూరు, అనంతపురం జట్ల మధ్య జరిగిన మ్యాచ్ డ్రాగా ముగిసింది. మొదటి ఇన్నింగ్స్‌లో అనంతపురం జట్టు 146 పరుగులు చేసింది. ఒక వికెట్ నష్టానికి 80 పరుగుల స్కోరుతో చివరి రోజు బ్యాటింగ్ ప్రారంభించిన చిత్తూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 87.5 ఓవర్లలో 191 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని మహమ్మద్ ఇజ్హార్ 50, లిఖిత్ ఇరగం రెడ్డి 45 పరుగులు చేశారు. అనంతపురం జట్టులోని ఆదిత్య రెడ్డి 2, జస్వంత్ సాయి 2, టేడ్రిక్ 2 వికెట్లు తీసుకున్నారు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన అనంతపురం జట్టు ఆట ముగిసే సమయానికి 43.0 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 127 పరుగులు చేసింది. కెఒఆర్ఎం క్రికెట్ మైదానంలో కడప, నెల్లూరు జట్ల మధ్య జరిగిన మ్యాచ్ డ్రాగా ముగిసింది. మొదటి ఇన్నింగ్స్‌లో కడప జట్టు 280 పరుగులు చేసింది. నెల్లూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 90 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 348 పరుగులు చేసింది. ఆ జట్టులోని సూర్య 111 పరుగు (సెంచరీ) చేశాడు. ఎస్.కె సమీర్ 119 పరుగులు (సెంచరీ) చేసి నాటౌట్‌గా నిలిచాడు. కడప జట్టులోని తాహిర్ రెండు వికెట్లు తీసుకున్నాడు. మ్యాచ్ డ్రాగా ముగిసింది.

సూచిక బోర్డు ఏర్పాటు చేయాలని వినతి



ఆర్అండ్‌బి ఇఇకి వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

కలెక్టర్ కార్యాలయం నుంచి రిమ్స్‌కు వెళ్లే దారిలో శివానందపురం వద్ద వాహన వేగ నియంత్రికకు అవసరమైన సూచికను ఏర్పాటు చేయాలని సిపిఎం నగర కార్యదర్శి రామమోహన్ డిమాండ్ చేశారు. బుధవారం ఆర్అండ్‌బి ఇఇ నాగేశ్వర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామమోహన్ మాట్లాడుతూ ఇండస్ట్రియల్ ఎస్టేట్, శివానందపురం రహదారి వద్ద అనేక ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని తెలిపారు. ఈ దారిలో వాహనాలు ఎక్కువ వేగంతో వస్తున్నాయని, దీని కారణంగా శివానందపురం దారి వద్ద ప్రమాదాలు ఎక్కువగా చోటు చేసుకుం టున్నాయని చెప్పారు. ప్రమాదాల నివారణకు ఆర్అండ్‌బి, పోలీస్ అధికారులు సమన్వయంతో అవసరమైన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. శివానందపురం దారి వద్ద అటువైపు, ఇటువైపు బ్రాందీ షాపులు ఉన్నాయని, అక్కడ ప్రజలు ఎక్కువగా ఉండే అవకాశం ఉందని తెలిపారు. ప్రజల సంచారం ఎక్కువగా ఉండటం, వాహనాలు వేగంగా రావటం వల్ల జరిగే ఇబ్బందులను అధిగ మించడానికి అవసరమైన చర్యలను చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని ఆర్ అండ్ బి, పోలీసుల సమన్వయంతో సమస్యను పరిష్కరి ంచేందుకు కృషి చేస్తామని ఆర్అండ్‌బి ఇఇ సిపిఎం నేతలకు హామీ ఇచ్చారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు దస్తగిరిరెడ్డి, పార్టీ సీనియర్ నాయకుడు రామకృష్ణారెడ్డి, నరసింహ పాల్గొన్నారు.

గ్రంథాలయ పోస్టులు వెంటనే భర్తీ చేయాలి

ప్రజాశక్తి - బద్వేలు : రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న అన్ని రకాల గ్రంథాలయ పోస్టులను వెంటనే భర్తీ చేసి రెండు లక్షలమంది నిరుద్యోగులకు న్యాయం చేయాలని లేని పక్షంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామని డివైఎఫ్ఐ కడప జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని హెచ్చరించారు. బుధవారం డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ కమిటీ ముఖ్య నాయకులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాళీగా ఉన్న లైబ్రరీయన్ పోస్టులు తక్షణమే నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో డిజిటల్ లైబ్రరీలను అందుబాటులోకి తీసుకోరావాలని కోరారు. గ్రంథాల యాలకు సొంత భవనాలను ఏర్పాటు చేయాలని, గతంలో మాదిరిగా హై స్కూల్లో లైబ్రరీలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. మూడు దశాబ్దాలుగా రెగ్యులర్ నోటిఫికేషన్ లేనందున వయోపరిమితి 47కు పెంచాల న్నారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఎస్కె మస్తాన్ షరీఫ్, ఎస్ కే ఆదిల్, రూరల్ కార్యదర్శి కార్యదర్శి ముడమాల ఓబుల్ రెడ్డి, పట్టణ ఉపాధ్యక్షుడు యువరాజ్, సహాయ కార్యదర్శి నరసింహ పాల్గొన్నారు.

శ్రీకృష్ణదేవరాయలు జయంతిని
అధికారికంగా నిర్వహించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : దక్షిణ భారతదేశన్ని ఏకచాత్రాధిపత్యంగా ఏలిన శ్రీకృష్ణదేవరాయలు జయంతి ఉత్సవాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాక కార్యదర్శి బాలిశెట్టి హరిప్రసాద్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోరారు. అన్నమయ్య జిల్లా రాయచోటి పర్యటనలో భాగంగా కార్యక్రమం ముగించుకుని తిరుగు ప్రయాణంలో కడప ఎయిర్‌పోర్టుకు వచ్చిన చంద్రబాబు నాయుడు ఆయన కలిసి బలిజలకు ఆరాధ్యమైన శ్రీకృష్ణదే వరాయలు జయంతి ఉత్సవాలను ప్రభుత్వపరంగా అధికారికంగా నిర్వహించేలా జీవో ఇవ్వాలని కోరారు. అందుకు ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందిస్తూ వచ్చే సంవత్సరం కృష్ణదేవరాయ జయంతిని అధికారికంగా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. చంద్రబాబు కలిసిన వారిలో టిడిపి రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి గోవర్ధన్ రెడ్డి ఉన్నారు

విజయవంతంగా 'స్త్రీ శక్తి' అమలు
- ఆర్‌టిసి జోనల్ చైర్మన్ నాగరాజు

ప్రజాశక్తి - కడప అర్బన్ : సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా మహిళల కోసం స్త్రీ శక్తి పథకం విజయవంతంగా అమలవుతుందని, 90 రోజుల్లో ఐదు కోట్ల మంది మహిళలు ప్రయాణం చేశారని ఆర్‌టిసి జోనల్ చైర్మన్ నాగరాజు వెల్లడించారు. బుధవారం ఆర్ఎం కార్యాలయంలోని తన ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళల ప్రయాణం కోసం రూ. 207 కోట్లు చెల్లించిందని పేర్కొన్నారు. పథకం అమలులో వస్తున్న సాధక బాధకాలను అధికారులు చూసుకోవాలని స్పష్టం చేశారు. శైవ క్షేత్రాలకు 100 బస్సులు నడుపుతున్నామని చెప్పారు. జోన్ పరిధిలో రూ.5 కోట్లు ఆదాయం వచ్చిందని పేర్కొన్నారు. కార్తీక మాసం ఇంకా కొన్ని రోజులు ఉన్న కారణంగా మరింత ఆదాయం వచ్చే అవకాశం ఉందని చెప్పారు. ఆర్‌టిసి సురక్షిత ప్రయాణం అందిస్తుందని తెలిపారు. అర్హులైన వారికి ఉద్యోగోన్నతలు కల్పించేందుకు సిఎం చంద్రబాబు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. అదనపు బస్సులు త్వరలో వస్తాయని వివరించారు. గత వైసిపి ప్రభుత్వం ఆర్‌టిసిని నిర్వీర్యం చేసిందని విమర్శించారు. కారుణ్య నియామకాలను చేపడతామని తెలిపారు. ఖాళీలను కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ పద్ధతిలో భర్తీ చేస్తామని పేర్కొన్నారు. దాదాపు 7,500 మందిని రిక్రూట్మెంట్ చేయాలని ప్రభుత్వాన్ని కోరినట్లు చెప్పారు.

నేటి నుంచి శిక్షణ తరగతులు : ఎంపిడిఒ

మాట్లాడుతున్న ఎంపిడిఒ

ప్రజాశక్తి - కలసపాడు : స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సభా భవనంలో సర్పంచులకు, ఉప సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ తరగతులు ఈనెల 13 నుంచి నిర్వహించ నున్నామని ఎంపిడిఒ పి. మహబూబ్‌బీ పేర్కొ న్నారు. ఆమె బుధవారం విలేకర్లతో మాట్లాడుతూ 14న మండల రీసోర్స్ పర్సన్ ఆధ్వర్యంలో విఒఎలకు, అధ్యక్ష, ఉపాధ్యక్షులలకు, ఎస్‌జిహెచ్ సభ్యులకు క్లీన్ అండ్ గ్రీన్‌పై శిక్షణ ఉంటుందని, తప్పక హాజరు కావాలన్నారు.

బాంబు పేలుడు కేంద్ర ప్రభుత్వ వైఫల్యం

ప్రజాశక్తి - కడప : ఢిల్లీలోని రెడ్‌ఫోర్ట్ వద్ద జరిగిన బాంబు పేలుడు దాడి కేంద్ర ప్రభుత్వం వైఫల్యమేనని, దాడికి బాధ్యత వహిస్తూ కేంద్ర హోంశాఖా మంత్రి రాజీనామా చేయాలని డిసిసి అధ్యక్షులు ఎన్.డి.విజయ జ్యోతి డిమాండ్ చేశారు. బుధవారం కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఢిల్లీలో బాంబు దాడిలో జరిగిన మృతులకు తొలుత రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ దేశంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా ఒక రోజు ముందు దేశంలో బాంబుదాడులు జరుగుతున్నాయని అన్నారు. దానివల్ల అమాయక ప్రజలు మరణిస్తున్నారని తెలిపారు. బీహార్ ఎన్నికల్లో దొంగ ఓట్ల ప్రభావం చాలా ఉందన్నారు. మొదటి విడతలో ఎగ్జిట్ పోల్స్‌లో కూడా కాంగ్రెస్ అనుకూలంగా వచ్చాయని, ఎలక్షన్ ఒకరోజు ముందుగా బాంబు దాడి జరిగి కులాలకు మతాల మధ్య రెచ్చగొట్టడం ఎన్‌డిఎ ప్రభుత్వానికి చెల్లుతుందని ఆమె మండిపడ్డారు. బద్వేల్ నియోజకవర్గాన్ని రాజంపేట జిల్లాలో కలపడం వల్ల ప్రజలకు చాలా దూరం పెరుగు తుందని, ఇలాంటి చర్యలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మానుకోవాలని అన్నారు. లేనిపక్షంలో కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఉద్యమాలు చేస్తుందని ఆమె తెలిపారు. కార్యక్రమంలో కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీ సయ్యద్ గౌస్ పీర్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు విజయ్ కుమార్, మైనార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మైనుద్దీన్, మైనార్టీ కడప సిటీ అధ్యక్షులు ముబారక్‌బాషా, యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు అబ్దుల్ రఫ్ , డివిజన్ ఇన్చార్జులు హరిప్రసాద్, కరీం, నీలం గఫార్, దాసరి శ్రీనివాసులు, సిద్ధిక్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడతున్న ఎన్.డి.విజయజ్యోతి

గిట్టుబాటు ధరలేకపోవడంతో పొలంలోనే అరటి గెలలు

ధరలేక అరటి రైతులు విలవిల

ప్రజాశక్తి - తొండూరు

అరటి ధరలు పూర్తిగా క్షీణించడంతో రైతులు విలవిల్లాడుతున్నారు. ప్రతి కార్యక్రమానికి అరటి పండుకు ప్రాధాన్యత ఉంటుంది. ప్రస్తుతం టన్ను అరటికాయలు రూ.3వేలు కూడా పలకడంలేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. కార్తిక మాసం, శ్రావణ మాసం, శుభకార్యాలు సమయంలో మంచి డిమాండ్ ఉంటుంది. ప్రస్తుత కార్తిక మాసం, శుభకార్యాల సమయంలో కూడా అరటి గెలలను కోయలేకున్నామని వాపోతున్నారు. సాధారణంగా అరటి టన్ను రూ.12వేల నుంచి రూ.15వేల వరకు ధర ఉంటుంది. ప్రస్తుతం ఎగుమతిలేక అరటి గెలలను కోయలేకున్నామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అరటిసాగుకు లక్షలాది రూపాయలు ఖర్చు చేశామని రైతులు అల్లాడిపోతున్నారు.

సివి సుదర్శన్‌రెడ్డిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

పూర్వ విద్యార్థుల ఔదార్యం

ప్రజాశక్తి - తొండూరు

తొండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు చిత్తశుద్ధితో ముందుకు వచ్చారు. ఇటీవల 1994-95 బ్యాచ్‌కు చెందిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో పోగుచేసిన రూ.50వేలు చెక్కును, 2003-04 బ్యాచ్ విద్యార్థులు రూ.25,000 చెక్కును బుధవారం ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కెవి సుబ్బారెడ్డికి అందజేశారు. 1994-95 బ్యాచ్‌కు చెందిన సుదర్శన్‌రెడ్డి ప్రస్తుతం సింగపూర్‌లో పని చేస్తున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు ఆయనను ఘనంగా సన్మానించారు. పాఠశాల గర్వ కారణమైన సుదర్శన్‌రెడ్డి తన కృషి, నిబద్ధతతో విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలిచారని ఉపాధ్యాయులు ప్రశంసించారు. అనంతరం సివి సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ ఈ పాఠశాల తనకు బలమైన పునాది వేసిందన్నారు. తన ఎదుగుదలకు గురువుల మార్గదర్శకతే కారణమని భావోద్వేగానికి గురయ్యారు. పూర్వ విద్యార్థుల సహకారంతో పాఠశాల అభివృద్ధి పట్ల అందరిలో సానుకూల వాతావరణం నెలకొంది. ఇందుకు తోడ్పాటు అందించిన పూర్వ విద్యార్థులకు, స్ఫూర్తి నిలిచిన సుదర్శన్‌రెడ్డికి ఉపాధ్యాయులు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

పులివెందులకు బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న వేల్పుల రాము

వేములలో వైసిపి బైక్ ర్యాలీ

ప్రజాశక్తి - వేముల

మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆదేశాల మేరకు బుధవారం చేపట్టిన నిరసన కార్యక్రమంలో భాగంగా వైసిపి వేముల మండల పరిశీలకుడు లింగాల రామలింగారెడ్డి వేల్పుల రాము నుంచి పులివెందులకు 200 బైక్‌లో 300 మందితో వెళ్లారు. అభిమానులు కార్యకర్తలు, నాయకులను కలుపుకొని వెళ్లారు. వైసిపి అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఎంపీ అవినాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ సతీష్‌రెడ్డి, వైఎస్ మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో పులివెందుల ఆర్‌డిఒ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి వినతిపత్రం అందజేశారు.

వల్లెపు సుబ్బరాయుడు నేత్రదానం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన వల్లెపు సుబ్బరాయుడు (80) మంగళవారం మృతి చెందడంతో ఆయన కుమారులు సుబ్బరాయుడు, కోడలు రామాంజనమ్మ, మనవళ్లు గంగాధర్, గోవర్ధన్, శ్రీనివాసులు, మనవరాళ్లు రమాదేవి, లక్ష్మీదేవి ఆయన నేత్ర దానానికి అంగీకరించారు.



ఈ విషయాన్ని జిల్లా అంధత్వ నివారణ సంస్థ, స్నేహిత అమృత హస్తం సేవాసమితి నేత్ర సేకరణ కేంద్రం అధ్యక్షులు రాజుకు తెలిపారు. ఆ మేరకు బుధవారం టెక్నీషియన్ అరవింద్ సుబ్బరాయుడు మృతదేహం నుంచి కార్నియాలను సేకరించి ఎల్‌వి ప్రసాద్ నేత్రాలయానికి పంపారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ కుటుంబంలోని వ్యక్తి లేదా సన్నిహితులు మరణిస్తే నేత్రదానం చేయదలచిన వారు 99665 09364 సంప్రదించాలని కోరారు. సుబ్బరాయుడు నేత్రదానానికి అంగీకరించిన ఆయన కుటుంబ సభ్యులకు గ్రామపెద్దలు, బంధువులు, సన్నిహితులు, సేవాసమితి బృందం కృతజ్ఞత అభినందనలు తెలిపారు.

ఎస్‌టియు జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శిగా ఓబన్న

ప్రజాశక్తి - ఖాజీపేట

ఎస్‌టియు జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శిగా బీసీ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు ఓబన్న ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా వెంకట్రామిరెడ్డి, ఆర్థిక కమిటీ సభ్యులుగా కరిముల్లా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి కూశెట్టి పాలకొండయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్య ఉపాధ్యాయ రంగ సమస్యల పరిష్కారం కోసం ఎస్‌టియు ఎంతగానో కృషి చేస్తోందని తెలిపారు.

డిప్యూటీ ఎంపిడిఒకు ఘన సన్మానం

ప్రజాశక్తి - సింహాద్రిపురం

సింహాద్రిపురం పంచాయతీ గ్రేడ్ వన్ కార్యదర్శి వెంకటరాముడికి డిప్యూటీ ఎంపిడిఒగా ఉద్యోగోన్నతి లభించింది. ఆయన రెండేళ్ల నుంచి సింహాద్రిపురం పంచాయతీ ఇఒగా విధులు నిర్వహిస్తూ ఉద్యోగన్నతిపై లింగాల వెళ్లనున్నారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ సిబ్బంది బుధవారం ఆయనను ఘనంగా సత్కరించారు. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తూ అందరి మననలు చూరగొన్న వ్యక్తి వెంకటరాముడును పలువురు వక్తలు కొనియాడారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయి ఎదగాలని ఆకాంక్షించారు.

వెంకటరాముడును సత్కరిస్తున్న పంచాయతీ సిబ్బంది

వరిలో ఎర్ర తెగులు నివారణ చేపట్టాలి

రైతులకు సూచనలిస్తున్న ఎడిఎ, ఎఒ

ప్రజాశక్తి - చాపాడు

వరిలో అధికంగా ఎర్ర తెగులు ఆశించిందని, జాగ్రత్తలు తీసుకోవాలని ఎడిఎ కృష్ణమూర్తి రైతులకు సూచించారు. మండలంలోని భద్రిపల్లి, నెర్రవాడ గ్రామాల్లో బుధవారం ఎఒ దేవి పద్మలత ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఖరీఫ్‌లో సాగైన వరి పంటను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఎర్ర తెగులు నివారణకు ఎకరాకు 200 మి.లీ. ప్రోపికనజోల్ పిచికారి చేయా లన్నారు. మట్టి నమూనా పరీక్షల గురించి రైతులకు వివరించారు తద్వారా 12 రకాల విషయాలు తెలుస్తాయన్నారు. కార్యక్రమంలో విఎఎ సుప్రియ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది క్రిష్ణమూర్తి, మహేష్, రైతులు పాల్గొన్నారు.

మైదుకూరులో.. మైదుకూరు మండలం శెట్టివారిపల్లె, కేశలింగాయపల్లెలో బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ ఇ.బాల గంగాధర్‌రెడ్డి మాట్లాడుతూ ఖరీఫ్ పంట కాలం పూర్తయిందన్నారు. ప్రస్తుతం రబీలో విత్తబోయే పంట వివరాలను నమోదు చేయించుకోవాలన్నారు. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాల అర్హులు, అనర్హులు అనే దానిపై ఆయన రైతులకు వివరించారు. భూమాత రక్షణ కార్యక్రమంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకంగా ఎరువుల వినియోగాన్ని అవసరమైన మేరకు మాత్రమే ప్రోత్సహించే దిశగా ఎన్నో చర్యలు తీసుకుంటున్నాయన్నారు. కార్యక్రమంలో ఏపీఎంఐపి సిద్ధారెడ్డి, సెరికల్చర్ అధికారి గురప్ప, వ్యవసాయ, ప్రకృతి సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రైతు ఉత్పత్తిదారుల సంఘాలతో లబ్ధి

ప్రజాశక్తి - ముద్దనూరు

రైతు ఉత్పత్తిదారుల సంఘాలతో రైతులకు లబ్ధి చేకూరుతుందని వెలుగు ఎపిఎం అపర్ణదేవి తెలిపారు. స్థానిక మహిళా మండలి సమాఖ్య కార్యాలయంలో బుధవారం ఎపిఎం ఆధ్వర్యంలో రైతు సమాఖ్య అధ్యక్షులు శివపార్వతి అధ్యక్షతన వ్యవసాయ, అనుబంధ ఉత్పత్తిదారులు ద్వితీయ వార్షిక మహాసభ నిర్వహించారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలుగా ఏర్పడడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి ఎపిఎం వివరించారు. మండలానికి కేటాయించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలని సూచించారు. వ్యవసాయ ఉత్పత్తిదారుల నిర్వహణకు అవసరమైన నిధులు, లైసెన్స్, జిఎస్టి, ఫెర్టిలైజర్స్ తీసుకుంటారన్నారు. వ్యాపారం చేసేందుకు లీడర్లకు శిక్షణ ఇవ్వనున్నట్లు ఆమె పేర్కొన్నారు. రైతులు ఐక్యతగా కార్యక్రమాలు చేసుకోవాలని కోరారు. అనంతరం నూతన బోర్డు అఫ్ డైరెక్టర్లుగా 15 మందిని ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రాధాకృష్ణవేణి, పశు వైద్య శాఖ ఎడిఎ డాక్టర్ వాసా శ్రీనివాస, ఎఒ వెంకటకృష్ణారెడ్డి, సిసిలు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రవాసాంధ్రులు భరోసా బీమాను సద్వినియోగం చేసుకోవాలి

- ఎపిఎన్‌ఆర్‌టి కువైట్ ఉపాధ్యక్షులు రహమతుల్లా

ప్రజాశక్తి - కడప అర్బన్

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన ప్రవాసాంధ్ర భరోసా బీమా పథకం అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని ఎపిఎన్‌ఆర్‌టి కువైట్ ఉపాధ్యక్షులు షేక్.రహమతుల్లా కోరారు. మంగళవారం ప్రజాశక్తితో మాట్లాడుతూ దుబాయిలో సిఎం చంద్రబాబు నాయుడు ఈ పథకాన్ని ప్రారంభించారని పేర్కొన్నారు. విదేశాలలో నివసిస్తున్న ఉద్యోగులు, వలసకార్మికులు, విద్యార్థుల కోసం ఈ పథకం రూపొందించారని తెలిపారు. ఉద్యోగులు, వలసకార్మికులకు సంబంధించి వయసు 18 నుంచి 50 సంవత్సరాల మధ్య ఉండాలని చెప్పారు. ప్రీమియం 3 సంవత్సరాలకు రూ.550 చెల్లించాలన్నారు. విద్యార్థులు ప్రీమియం ఏడాదికి కేవలం రూ.218 చెల్లించాలని పేర్కొన్నారు. ప్రధాన ప్రయోజనాలు రూ.10 లక్షల బీమా లభిస్తుందని తెలిపారు. బీమా చేసిన వ్యక్తి ప్రమాదవశాత్తు మరణించినా, శాశ్వత అంగవైకల్యం కలిగినా వారి కుటుంబానికి రూ.10 లక్షలు ఆర్థిక సహాయం అందుతుందని చెప్పారు. ప్రమాద వశాత్తు విదేశాలలో మరణిస్తే భౌతికగాయన్ని స్వదేశానికి తీసుకువచ్చేందుకు అయ్యే ఖర్చును ఈ పథకం ద్వారా అభిస్తుందని పేర్కొన్నారు. రూ.లక్ష మెడికల్ ఇన్సూరెన్స్ ఉంటుందని, వైద్య ఖర్చులు భరిస్తుందని తెలిపారు. ప్రమాదం, అనారోగ్యం కారణంగా చదువు కొనసాగించలేదని విద్యార్థులను స్వదేశానికి వచ్చేందుకు విమాన ఖర్చులను భరిస్తుందని చెప్పారు. అంగవైకల్యం కలిగిన వ్యక్తికి అందనంగా రూ.50 వేలు ఆర్థిక సహాయం అందజేస్తారని పేర్కొన్నారు. మహిళా ఉద్యోగులకు ప్రత్యేక ప్రయోజనాలను ఈ బీమాలో చేర్చారని తెలిపారు, ప్రమాదాలు, తీవ్రగాయాలు, అనారోగ్యం, ప్రసవం అయ్యేవారికి ఆర్థిక సహాయం అందిస్తారని తెలిపారు. ఉచిత న్యాయ ఖర్చుల కోసం విదేశాల్లో చట్టపరమైన, న్యాయపరమైన సమస్యలు ఎదురైతే రూ.45వేల వరకు ఖర్చులను ఈ పథకం భరిస్తుందని చెప్పారు. ఉద్యోగులు, వలసకార్మికులు, విద్యార్థులు పాస్‌పోర్టు మొదటి, చివరి పేజీ విదేశాలకు సంబించిన కార్డులు, ఫారన్ రెసిడెన్సీ గుర్తింపు కార్డులు ఉండాలని పేర్కొన్నారు. ప్రవాసాంధ్రులు ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ముఖ్యమంత్రి చంద్రబాబుకు సమస్యలు వివరిస్తున్న రహమతుల్లా (ఫైల్)

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు స్వామి వివేకానంద విద్యార్థులు

విద్యార్థులతో కరస్పాండెంట్ రామాంజనేయరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లాస్థాయి క్రీడా పోటీల ఎంపికల్లో మంచి ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు తమ విద్యార్థులు ఎంపికైనట్లు స్వామి వివేకానంద పాఠశాల కరస్పాండెంట్ రామాంజనేయరెడ్డి పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులను మంగళవారం ఆయన అభినందించారు. ఈ సందర్భంగా రామాంజనేయరెడ్డి మాట్లాడుతూ విజయవాడ, శ్రీకాకుళంలో జరిగిన ఆయా నేషనల్ క్రీడా పోటీల్లో ప్రతిభ చూపారన్నారు. రాష్ట్రస్థాయిలో మదనపల్లి, కాకినాడ విజయనగరంలో జరిగే క్రీడా పోటీలకు వెళతారన్నారు. నేషనల్ లెవెల్‌లో ఖోఖో విభాగం నుండి అండర్-14కు భరణికుమార్ రెడ్డి, పవన్‌కొండారెడ్డి, అండర్-17 విభాగంలో దేవేంద్రారెడ్డి, పి.మహేశ్వర్‌రెడ్డి ఎంపికైనట్లు వివరించారు. బాస్కెట్ బాల్ పోటీలలో అండర్-14కు ప్రవీణ్‌కుమార్ రెడ్డి, గౌతంకుమార్ రెడ్డి, అండర్-17కు కార్తీ కుమార్‌రెడ్డి, అండర్-19 విభా గంలో శ్రీమణి, రేవంత్ కుమార్‌రెడ్డి ఎంపికయ్యారని తెలిపారు. హ్యాండ్ బాల్ పోటీలకు అండర్-14 నుండి షర్మిల, ప్రశాంత్ కుమార్‌రెడ్డి, దేవేం ద్రరెడ్డి, అండర్-17 విభాగానికి హాసిని, ప్రమీల, సాహిత్య, అండర్-19 విభాగానికి భానుశ్రీ ఎంపికైనట్లు ఆయన వివరించారు. అథ్లెటిక్స్ విభా గానికి శివమణి, గోవర్ధన్‌రెడ్డి ఎంపిక కాగా, జిల్లాస్థాయి యోగా పోటీలకు సుమాంజలి, ప్రవీణ్ కుమార్‌రెడ్డి కూడా ఎంపికైనట్లు తెలిపారు. ఆయా క్రీడా పోటీలకు అన్ని విభాగాలకు తమ పాఠశాల విద్యార్థులు ఎంపిక కావడం సం తోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా పిఇటి పద్మజను ప్రత్యేకంగా అభినందించారు.

ఘనంగా ఎమ్మెల్యే 'వరద' జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్)

ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి జన్మదినం సందర్భంగా బుధవారం టిడిపి నాయకులు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక ఎద్దుల సుబ్బమ్మ మున్సిపల్ గర్ల్స్ హైస్కూల్‌లో ఎమ్మెల్యే సోదరుడు నంద్యాల ఆనంద భార్గవరెడ్డి బాలికలకు స్వీట్స్ పంపిణీ చేశారు. అక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయులకు 15 కుర్చీలు వితరణ చేశారు. అనంతరం విద్యార్థులకు ఆయన మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా ఆహారం వడ్డించారు. ఆచార్య నాగార్జున స్కూల్ అధినేతలు ఇంజా లక్ష్మిరెడ్డి, గుమ్మల రవిశంకర్ రెడ్డి, సాకం నాగేశ్వర్‌రెడ్డి, నల్లబోతుల నాగరాజు, స్కూల్ హెడ్మాస్టర్ విజయభాస్కర్, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు. స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలోని శ్రీవీరబ్రహ్మేంద్ర స్వామి వృద్ధాశ్రమంలో 26వ వార్డు ఇన్‌ఛార్జి తలారి రమేష్ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

మంత్రి లోకేష్‌ను కలిసిన 'పేర్ల'

ప్రజాశక్తి - వేముల

విజయవాడలోని టిడిపి కేంద్ర కార్యాలయంలో ఆపార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ను బుధవారం టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారథిరెడ్డి కలిశారు. ఈ సందర్భంగా పులివెందుల నియోజకవర్గంలో నెలకొన్న పలు సమస్యలను, మండల కార్యకర్తల సమస్యలను లోకేష్‌కు వివరించారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించి, త్వరలోనే సమస్యల పరిష్కారానికి పార్టీ చొరవ చూపిస్తుందని హామీ ఇచ్చినట్లు పార్థసారథిరెడ్డి తెలిపారు.

ఎంచుకున్న రంగాల్లో రాణించాలి

ప్రజాశక్తి - వేంపల్లె

బాలికలు ఎంచుకున్న ఆయా రంగాల్లో రాణించాలని సిడిపిఒ సునీత పేర్కొన్నారు. ఐసిడిఎస్ వేంపల్లె ప్రాజెక్టు ఆధ్వర్యంలో బుధవారం స్థానిక బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ బాలిక దినోత్సవం ముగింపు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రయివేటు రంగాల్లో మహిళలు రాణిస్తున్నారని తెలిపారు. క్రమశిక్షణతో విద్యాభ్యాసం చేస్తే ఉన్నత శిఖరాలకు ఎదగవచ్చని ఆమె సూచించారు. వేంపల్లె, వేముల, చక్రాయపేట, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు వ్యాసరచన పోటీల్లో ప్రతిభ చాటినట్లు తెలిపారు. పరిసరాలను గ్రమనిస్తూ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. బాల్య వివాహాలపై అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. చదువు మధ్యలో ఆపకుండా కొనసాగించాలని బాలికలకు సూచిం చారు. అనంతరం వ్యాసరచన పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో స్కూల్ ఇన్‌ఛార్జి హెడ్ మాస్టర్ శ్రీనివాసులు, సూపర్ వైజర్ స్వర్ణలత, సుభాషిణి, హసీనా, శ్రావణి, భారతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ప్రజాశక్తి - వేంపల్లె

కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి సూచించారు. పోరుమామిళ్ల కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు డాక్టర్ అన్వర్ బుధవారం ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు కాంగ్రెస్ పార్టీ బలోపేతంపై చర్చించారు. వైసిపి, కూటమి ప్రభుత్వాలు రాష్ట్రాన్ని అప్పులకుప్ప చేశాయని విమర్శించారు. అప్పులు చేయడంలో కూటమి ప్రభుత్వానికి ఆస్కార్ అవార్డు ఇవ్వొచ్చని తులసిరెడ్డి ఎద్దేవా చేశారు.

నేటి నుంచి పారిశుధ్య నిర్వహణపై శిక్షణ

ప్రజాశక్తి - చాపాడు

గ్రామపంచాయతీలో పారిశుధ్య నిర్వహణపై రెండు రోజులపాటు శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ వీర కిషోర్ ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం సర్పంచులు, ఉప సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఉంటుందన్నారు. శుక్రవారం మహిళా సంఘాల విఓలకు, సిబ్బందికి, ఎస్‌హెచ్‌జీ సభ్యులకు శిక్షణ ఉంటుందన్నారు.

మైదుకూరులో.. మైదుకూరు ఎంపిడిఒ కార్యాలయ సభా భవనంలో గురువారం సర్పంచులకు, ఉప సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ శ్రీధర్ నాయుడు తెలిపారు. 14న శుక్రవారం మండల రిసోర్స్ పర్సన్ ఆధ్వర్యంలో గ్రీన్ అంబాసిడర్లకు, గ్రీన్ గార్డ్‌లకు, విఓఏ అధ్యక్ష, ఉపాధ్యక్షులకు, ఎస్‌హెచ్‌జీ మెంబర్లకు శిక్షణ ఉంటుందన్నారు. చెత్త సేకరణ, పారిశుధ్య నిర్వహణపై శిక్షణలో అవగాహన కల్పిస్తామన్నారు. **వేముల :** వేముల ఎంపిడిఒ కార్యాలయంలో గురు, శుక్రవారాల్లో ఎంపిడిఒ గంగాదేవి ఆధ్వర్యంలో క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్ థీమ్‌పై శిక్షణనివ్వనున్నారు. సర్పంచులు, ఉప సర్పంచులు, సిబ్బంది తప్పక హాజరు కావాలని ఎంపిడిఒ కోరారు.

సమావేశాల పేరుతో సచివాలయ సిబ్బంది డుమ్మా

ప్రజాశక్తి - ఖాజీపేట

ప్రజలకు మెరుగైన సేవలు గ్రామస్థాయిలోనే అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ అడ్డూఅదుపు లేకుండా కొనసాగుతోంది. సచివాలయాలను నిరంతరం పర్యవేక్షించాల్సిన ఉన్నతాధికారులు పత్తా లేకుండాపోతున్నారు. మండల వ్యాప్తంగా ఉన్న సచివాలయ సిబ్బంది వివిధ సమయాల్లో సమావేశాలు అంటూ ప్రజలకు అందుబాటులో ఉండడంలేదు. కార్యాలయాలకు వచ్చే ప్రజలు సిబ్బంది లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమావేశాలకు వెళ్లాల్సి వస్తే సచివాలయంలో మూవ్‌మెంట్ రిజిస్టర్‌లో నమోదు చేయాల్సి ఉండగా, ఎక్కడ అలాంటివి జరగట్లేదు. సచివాలయ స్థాయిలో పంచాయతీ సెక్రటరీ బాధ్యత వహించాల్సి ఉండగా ఎక్కడా పట్టించుకోవట్లేదు. సచివాలయాల వ్యవస్థపై ప్రజలకు నమ్మకం సన్నగిల్లుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సచివాలయ సిబ్బందిపై ప్రత్యేక పర్యవేక్షణ ఉంచి, మెరుగైన సేవలు అందేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

IN THE COURT OF THE HON'BLE SENIOR CIVIL JUDGE, PRODDATUR

I.P.No.48/2025

Syed Mohammad Sharuk Hussain S/o Syed Shabbir Hussain, age 28 years, Business, Residing at D.No.8/210-Upstair, Sriramulapeta, Proddatur Town, YSR Kadapa District, Andhra Pradesh-516360.

...Petitioner/debtor

Vs

K.S.Mohammad Azaruddin & 8 others

...Respondent/Creditors

పై నంబరు కేసులో పిటిషనర్ ఇన్సాల్వెంట్ గా డిక్లేర్ చేయమని పై కోర్టులో I.P.No.48/2025గా దాఖలు చేసినారు. ఎవరికైనా ఎలాంటి ఆక్షేపణలు ఉన్నయెడల 08.12. 2025న ఉదయం 10:30 గంటలకు మీరు కానీ మీ వకీలు ద్వారా కానీ హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినదిగా తెలియ జేయడమయినది.

//రాజశ్రీ కోర్టు వారి ఉత్తుర్వుల మేరకు//

P.SATEESH KUMAR REDDY

Advocate, PRODDATUR.

IN THE COURT OF THE HON'BLE SENIOR CIVIL JUDGE, PRODDATUR

I.P.No. 53/2025

Yerraballi Hassain Basha S/o Yerraballi Abdul Gaffar, age 44 years, Gold Business, Residing at D.No.11/578-UP, K.H.M.Street, Proddatur Town, YSR Kadapa District.

...Petitioner/debtor

Vs

Shaik Noor Mahammad & 13 others

...Respondent/Creditors

పై నంబరు కేసులో పిటిషనర్ ఇన్సాల్వెంట్ గా డిక్లేర్ చేయమని పై కోర్టులో I.P.No.53/2025గా దాఖలు చేసినారు. ఎవరికైనా ఎలాంటి ఆక్షేపణలు ఉన్నయెడల 07.01. 2026న ఉదయం 10:30 గంటలకు మీరు కానీ మీ వకీలు ద్వారా కానీ హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినదిగా తెలియ జేయడమయినది.

//రాజశ్రీ కోర్టు వారి ఉత్తుర్వుల మేరకు//

P.SATEESH KUMAR REDDY

Advocate, PRODDATUR.

సమావేశంలో మాట్లాడుతున్న బీటెక్ రవి

పార్టీ పటిష్టతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

టిడిపిని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసే లక్ష్యంతో ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పులివెందుల టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బిటెక్ రవి సూచించారు. పులివెందుల నియోజకవర్గంలో మండల, క్లస్టర్, యూనిట్, గ్రామ, బూత్ కమిటీల నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం బుధవారం పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆయా కమిటీల సభ్యులతో ఆయన ప్రమాణ స్వీకారం చేయించారు. కొత్తగా ఎన్నికైన వారు తమతమ బాధ్యతలను స్వీకరించారు. పార్టీ సిద్ధాంతాలకు, ప్రజలకు విశ్వసనీయంగా పనిచేస్తామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం బీటెక్ రవి మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో టిడిపి విజయం సాధించడంలో ఈ కమిటీలే ముఖ్య పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. పులివెందుల రాజకీయ చరిత్రలో బూత్ స్థాయి వరకు ఇంత పటిష్టంగా కమిటీలు ఏర్పాటు చేయడం ఇదే ప్రథమమని నాయకులు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం చేసే మంచి పనుల గురించి వైసిపి దుష్ప్రచారాలను ఎండగట్టాలన్నారు. ప్రమాణ స్వీకార కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, మండలస్థాయి నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. నూతన కమిటీల ఏర్పాటుతో పులివెందులలో తెలుగుదేశం పార్టీకి కొత్త ఉత్సాహం వచ్చిందని కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేశారు.

లబ్ధిదారు జ్యోతితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి

గృహ మంజూరు ప్రతాల పంపిణీ

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఎపి గృహ నిర్మాణ సంస్థ-ప్రధానమంత్రి ఆవాస్ యోజన (అర్బన్) 2.0 పట్టణ ప్రాంతంలో లబ్ధిదారులకు గృహాలను మంజూరు చేశారని, సంబంధిత పత్రాలను లబ్ధిదారులకు పంపిణీ చేశామని ఎమ్మెల్యే సి.ఆదినారాయణరెడ్డి తెలిపారు. పట్టణంలో బుధవారం గృహ మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమంలో ఆయన లబ్ధిదారులు జ్యోతి, షాహిదాకు చెందిన గృహాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి రాష్ట్రంలో మూడు లక్షల ఇళ్లను మంజూరు చేశాయన్నారు. పట్టణంలో 115 ఇళ్లు మంజూరు అయ్యాయని, 20 గృహాలకు మంజూరు పత్రాలను ప్రస్తుతం పంపిణీ చేశామన్నారు. కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి పరుగులు తీస్తోందని తెలిపారు. డ్వాక్రా రుణాలకు బ్యాంకులు వడ్డీలు ఎక్కువ వేస్తున్నారని, కట్టేందుకు ఇబ్బంది పడుతున్నామని మహిళలు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. వడ్డీలను తగ్గించేందుకు బ్యాంకు వారితో తాను మాట్లాడుతానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. స్థానిక వీధుల్లో ప్రజల సమస్యలు, నీటి సరఫరా గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జమ్మలమడుగు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్ రెడ్డి, కూటమి ఇన్‌ఛార్జి తప్పెట మధుసూదన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి, హౌసింగ్ పీడీ రాజారత్నం, మున్సిపల్ కమిషనర్ శేషఫణి, మార్కెట్ యార్డ్ చైర్మన్ నాగరాజు, హౌసింగ్ డిఇ రాజశేఖర్, హౌసింగ్ ఎఇ రామకృష్ణ, మెప్మా కో-ఆర్డినేటర్ నాగేంద్ర, టిడిపి మండల అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, టిడిపి పట్టణ అధ్యక్షుడు సంజీవరెడ్డి, పెద్ద సేట్, కత్తి ప్రతాపరెడ్డి, జంగంరెడ్డి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న నాగమునిరెడ్డి

బాలోత్సవం-3ని విజయవంతం చేయండి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

బాలోత్సవం- 3ని విజయవంతం చేయాలని ఆ కమిటీ సభ్యులు కోరారు. పట్టణంలోని గఫూర్ డ్రైవింగ్ స్కూల్‌లో బుధవారం బాలోత్సవం కమిటీ గౌరవాధ్యక్షులు నాగమునిరెడ్డి, అధ్యక్షుడు గోపాల్, కార్యదర్శి రాజశేఖర్ విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 29, 30 తేదీల్లో కడపలో జరిగే బాలోత్సవం-3కి పులివెందుల ప్రాంతం నుంచి పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పిల్లలను ప్రోత్సహించాలని, పెద్ద ఎత్తున పాల్గొనేలా చూడాలన్నారు. తద్వారా పిల్లల్లో దాగివున్న సృజనాత్మకతను వెలికి తీయవచ్చన్నారు. సమావేశంలో కడప జిల్లా జనవిజ్ఞాన వేదిక అధ్యక్షులు శివరాం, వేదిక్ మ్యాథమెటిక్స్ బాలశివ పాల్గొన్నారు.

రేపటి నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి - వేంపల్లె

ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు వేంపల్లె గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి వనజాకుమారి తెలిపారు. గ్రంథాలయ వారోత్సవాల్లో ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, ఆటల పోటీలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. గ్రంథాలయంలో 14న పిల్లల దినోత్సవం, 15న పుస్తక ప్రదర్శన, 16న గ్రంథాలయ పితామహుల చిత్ర పటాలకు నివాళి, 17న వ్యాసరచన పోటీలు, 18న చిత్రలేఖనం పోటీలు, 19న మహిళా దినోత్సవం, 20న వారోత్సవాలు ముగింపు సందర్భంగా బహుమతులు ప్రదానం ఉంటుందని ఆమె వివరించారు.

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT: PRODDATUR

O.S.No. 373/2020

1. కెనరా బ్యాంక్, మెయిన్ బ్రాంచ్, Represented by its Branch Manager కొర్రపాడు రోడ్డు, ప్రొద్దుటూరు బ్రాంచ్, వైయస్సార్ కడప డిస్టిక్, ఆంధ్రప్రదేశ్. **...వాది**

Vs

1. బొమ్మిశెట్టి సుధారాణి, D/o బి.క్రిష్ణ, వయస్సు 24 సం॥లు, హిందూ, రెసిడెంట్ ఆఫ్ డోర్‌నెం.5/1703, గీతాశ్రమం స్ట్రీట్, ప్రొద్దుటూరు టౌన్ & మండలం, కడప జిల్లా.
2. బొమ్మిశెట్టి క్రిష్ణ, S/o బి.సుబ్బన్న, వయస్సు 44 సం॥లు, హిందూ, రెసిడెంట్ ఆఫ్ డోర్ నెం.5/1703, గీతాశ్రమం స్ట్రీట్, ప్రొద్దుటూరు టౌన్ & మండలం, కడప జిల్లా.

...ప్రతివాదులు

పై నెంబర్ దావాలో వాది, ప్రతివాదులు అయిన మీపై మీరు వాది వద్ద తీసుకున్న లోన్ డబ్బులు వసూలు చేసుటకు దావా దాఖలు చేసినారు. అట్టి దావా యందు మీరు రాజశ్రీ కోర్టు వారి సమ్మర్లు తీసుకోకుండా కాలయాపన చేయుచున్నందున, ఈ పత్రికా ప్రకటన ద్వారా తెలియజేయడమేమనగా **27.11.2025** తేదీన పై కోర్టు యందు వాయిదా ఉన్నది. కావున పై కోర్టు యందు **ఉదయం 10:30** గంటలకు ప్రతివాది అయిన మీరు హాజరై పైన తెలిపిన కోర్టు యందు ఏమైనా ఆక్షేపణలు ఉన్నాయెడల మీరు గాని మీ వకీలు ద్వారా కానీ తెలుపున వచ్చును లేనంతట మీకు పరోక్షంగా తీర్మానించబడును.

వాయిదా 27.11.2025

//By Order of the Court//

సి. షకీల్ అహ్మద్

పెనెల్ అడ్వకేట్,

కెనరా బ్యాంకు ప్రొద్దుటూరు.